# జీవితంలో....?

... బాపరౌతు రాజేశ్వరి ...

★

సాయంత్రం 5 గం॥ అయింది. ఆఫీసుపనితో బుర్రంతా వేడెక్కి విసుగ్గా చిరాగ్గా యింటి కొచ్చాడు మూర్తి. వాకిట్లో చిన్న గార్డెన్ చల్లని పిల్లవాయువులతో అలముకొనికమ్మని తావులను వెదజల్లుతూ మల్లి, గులాబీ, మాలతీ లతలు శృంగారంగా తలలుఆడిస్తూ తనని ఆహ్వానిస్తున్నాయో అన్నట్టు వున్నాయ్. ఇంట్లోకి వెళ్ళాడు. హాలంతా పరిశుభ్రంగా వుండి అందంగా అలంకరించబడి వుంది. పిల్లలిద్దరూ ఆడుకుంటున్నారు. భార్య కమల ఏదో లేసు అల్లుకుంటోంది కాబోలు. భర్తరాక గమనించి చిరునవ్వుతో ఎదురు వొచ్చి కోటు, హేటు అంది పుచ్చుకుంది. స్వర్గసీమలా అలరారే గృహమూ, ముద్దుగా ఆడుకుంటున్న పిల్లలూ, చిరునవ్వుతో కళకళలాడుతున్న గృహలక్ష్మిని చూసేసరికి అతని విసుకు, చిరాకు మాయమైపోయాయి. కుర్చీలో కూచున్నాడు. భార్యతెచ్చిన టిఫిన్ కాస్తా అఖరుచేస్తూ తరువాత అందరూ చల్లగాలికోసం అలా షైరు వెళిపోయారు. ఆహా! జీవితం అంటే వారిదేకదా జీవితం. ఆ ప్రేమైక జీవులు మానవుని పవిత్రాశయాలను గుర్తెరింగి తమ కర్తవ్యాలని పాలిస్తూ "మానవుడు తల్చుకుంటే తన జీవితం పూలబాటలగుండా నడిపించగలడు" అని లోకానికి చాటిచూపుతున్నారు. ఈర్ష్యాద్వేషాలను దూరంగా పారద్రోలి పవిత్రహృదయంతో సంతృప్తిగా జీవించేవారికి ఎల్లప్పుడూ ఆనందం కాక మరేమిటీ ! ఈ విశాల ప్రపంచంలో ఏఒక్క మానవుడూ ఆపదల బారినుండి తప్పించుకోలేడు. అసలు సుఖదుఃఖాల కలయికయే మానవ జీవితం. ఎంతటి ఆపదలనైనా ధైర్యంతో ఎదుర్కొని శాంతిసహనాలతో పరిష్కరించుకుని జయించుకు రావడంలోనేవుంది మానవుని ధీరత్వం. విధి నిర్ణయించే దుఃఖాలకి మనం బాధ్యులం కాం నిజమే. కాని మన శక్తివంచనలేకుండా ఆనందంగా జీవించాలని మనం ఎందుకు ప్రయత్నించకూడదూ? కమలకూడా చదువుకున్న స్త్రీ. అయినా ఈకాలం చదువుకున్న పిల్లలికిమల్లే "నాకేపని చేతకాదు" అని కూచోదు. గృహాన్ని స్వర్గసీమలా అలంకరించడం, పతిని ఆనందతరంగాల్లో తేల్చివేయడం, పిల్లల్ని విజ్ఞానవంతులుగ, ధైర్యశాలులుగ తయారుచేయటం ఇవే ఆ గృహలక్ష్మి ఆశయాలు. ఆదర్శగృహిణిగ జీవించాలని ఆమె అభిలాష. మూర్తికూడా కమలని ఎంతో ప్రేమగా గౌరవంగా చూస్తాడు. ఇలాగే ఎన్నిదినాలీకాలప్రవాహంలో కొట్టుకుపోతున్నాయో !

ఆరోజున కొంచెం మబ్బుగావుంది. సన్నచినుకులు పడ్తే చలివేస్తోందికూడా. కమల పిల్లలబట్టలు ఏవో మెషిన్‌మీద కుట్టుకుంటోంది. ఆఫీసుకి శెలవ్. మూర్తికి ఏం తోచటం లేదు. ఏమిటో ఆలోచిస్తూ కూచున్నాడుకుర్చీలో. అతని చిన్నప్పటి జీవితమంతా సినిమా రీల్ లా ఒక్కటొక్కటే జ్ఞాపకంవస్తోంది. తన చిన్నప్పుడే తండ్రి చనిపోతే తల్లి తన చదువుకోసమని ఎంత కష్టపడేది. తన భావి జీవితంలోనే ఎన్నో ఆశాసౌధాలు నిర్మించుకునేది ఆ పిచ్చి తల్లి. "నేను ఎంతకష్టపడిఅయినా సరే అబ్బాయి చదువుకి ఏ లోటూ రాకుండా చూస్తాను. మా బాబు పెద్ద చదువు చదువుకుని పెద్దఉద్యోగం చేస్తుంటే ఇహ నాకేమిటి కొదువ" అని మురిసిపోయేది. అన్ని గాలిలో మేడలైనాయ్. తన చదువు పూర్తికాకముందె చనిపోయింది ఆ మాతృమూర్తి. ఆరోజున తనకెంత విరక్తికలిగిందీ. ఇహ తనజీవితంలో ఏకాకి. ప్రపంచంలో నా అనేవాళ్ళెవరూలేరు. కనిపెంచిన తలితండ్రులా లేదు. ఇక ఎవరికోసం జీవించాలి అనుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడుకూడా.

ఇంతలో అతనిలో ఏదోశక్తి ప్రేరేపించినట్లనిపించింది. "ఓయి వెర్రిమానవుడా కష్టసమయాల్లోనల్లా మానవులు చనిపోతుంటే ఇహ ప్రపంచం ఏముంది. చచ్చి ఎవరిని సాధిస్తావ్. జీవితంలొ కష్టాలులేని దెవరికి. ఎంతటి కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కోవడంలోనేవుంది మానవుని ధీరత్వం. మానవుడు తన జీవితం ఆనందమయంగా చేసుకోవాలన్నా, దుఃఖభాజనంగా గడపాలన్నా అంతా మానవుల్లోనేవుంది. 'కష్టేఫలీ' అని కష్టపడినవారికి ఫలితం ఎన్నటికైనా దక్కకపోదు. కొన్నాళ్ళు చీకటి, కొన్నాళ్ళు వెన్నెల ప్రకృతి సహజమేకా" ఏదొ కలలోంచి మేల్కొన్నట్లనిపించింది. అవును చచ్చిపోయి చేసేదేముంది. ఇహ నెను ఎప్పుడూ చనిపోవడానికి ప్రయత్నించను. నా భావి జీవితం ఎలాగడుస్తుందో చూస్తాను" అని హృదయాన్ని రాయిచేసుకుని కష్టపడి చదివినరోజులు, తన అదృష్టంకొద్దీ వెంటనే ఉద్యోగం లభించడం, తరువాత తన ఆశయాల్తో ఏకీభవించి సహధర్మచారిణిగా కమల తన అర్ధాంగిగా లభించటం; తను ఎప్పుడైనా అనుకున్నాడా తనజీవితం ఇంత ఆనందంగా గడుస్తుందని. నిజంగా కష్టపడినవాళ్లకి ఫలితం తప్పకుండా కలుగకపోదు. తను ఇంత ఆనందంగా జీవిస్తున్నందుకు తల్లివుంటే ఎంత మురిసిపోయేదో ? తల్లిజ్ఞాపకం వచ్చేసరికి అప్రయత్నంగా అతని దృష్టిపక్కనే పూలమాలతో అలంకరింపబడివున్న తల్లిఫోటొపై మళ్ళింది. ఇంతలోకే కమలకూడా వచ్చి ఆ ఫోటోనెచూస్తూ నిలబడిపోయింది. పిల్లలిద్దరూ గబగబా పరిగెత్తుకుంటూ వచ్చి ఆశ్చర్యంగా ఆ ఫోటోనేచూస్తూ నిలబడిపోయారు. ఆ మాతృమూర్తి స్వర్గధామంలోంచే కొడుకు, కోడలు మనుమలని చిరునవ్వుతో ఆశీర్వదిస్తున్నట్టనిపించింది.